# గీత దాటుతున్న సహకారం



- గీత పారిశ్రామిక సహకార సంఘంపై అవినీతి ఆరోపణలు
- మంచిర్యాలలో 'లీజు' పేరిట గోల్ మాల్
- గౌరవ సభ్యుల వేతనాల పేరిట నెలకు రూ. 2.80 లక్షలు...

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాలలో గీతా పారిశ్రామిక సహకార సంఘంలో భారీ అవినీతి దొర్లినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కన్వీనర్ గా వ్యవహరిస్తున్న వ్యక్తి పేరు మీద నెలకు రూ. 2.80 లక్షలు వసూలవుతున్నాయన్న అంశం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**లక్షల లాభాలున్నా..**

115 మంది సభ్యులతో ప్రారంభమైన ఈ సంఘంలో ప్రస్తుతం 144 మంది సభ్యులు ఉన్నారు. సభ్యుల లాభాల పేరిట కొంత మేర వరకు డబ్బులు పంచుతున్నా, గౌరవ సభ్యుల పేరుతో అదనంగా నెలకు లక్షల రూపాయలు వసూలు అవుతుండటంతో అసలు లాభాలు ఎక్కడకి పోతున్నాయో అనే సందేహం నెలకొంది. మూడవ పార్టీగా ఉండే కన్వీనర్ కు ఎలాంటి హోదా లేకపోయినా, నెలకు రూ. 2.80 లక్షల చెల్లింపులు అందుతుండటంపై పలువురు సభ్యులు తీవ్రంగా మండిపడుతున్నారు.

**లీజులో లొసుగులు..**
**లక్షల రూపాయల దుర్వినియోగం**


2024 సెప్టెంబర్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో గుర్రం రాజేందర్ గౌడ్ కు రెండు సంవత్సరాలకు లీజు ఇవ్వడం జరిగింది. లీజు పరంగా మొదటి సంవత్సరానికి రూ. 12.50 లక్షలు, రెండో సంవత్సరానికి రూ. 13.25 లక్షలు సొసైటీకి చెల్లించాల్సి ఉంది. అయితే ఇదే అగ్రిమెంట్‌లో కన్వీనర్ కు నెలకు రూ. 2.80 లక్షలు చెల్లించాలన్న షరతు చొరబెట్టడం గమనార్హం. ఈ డబ్బుల ప్రయోజనం ఏమిటన్నది ఇప్పటివరకు అస్పష్టంగా ఉంది.

**కానరాని ఆడిటింగ్**

సంఘ సమావేశాలు జరగడం లేదు. ఆడిటింగ్ జరుగుతుందో లేదో కూడా తెలియని పరిస్థితి. నెలకు వస్తున్న రూ. 2.80 లక్షలు ఏ ఖాతాలోకి వెళ్తున్నాయన్నది అంతుచిక్కని మిస్టరీగా మారింది. బిల్లు పత్రాలు లేకుండానే కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సభ్యుల్లో ఆందోళన**

సంఘ సభ్యుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కొందరికి డబ్బులు రావడం లేదని, కనీసం సంఘం పేరు మీద ఒక్క భవనం కూడా లేనని వాపోతున్నారు. వైద్యులు, చిన్నారులు, ప్రభుత్వ ఉద్యోగులకు సభ్యత్వం ఇవ్వడం ద్వారా అసలు గీత కార్మికుల హక్కులను కాదనుతున్నారు.



**విచారణ జరిపించాలి**

"మా సంఘానికి కన్వీనర్ గా ప్రకటించుకొని పెత్తనం చెలాయిస్తున్నాడు. నెలకు రూ. 2.80 లక్షలు తీసుకుంటూ సేవల పేరుతో మోసం చేస్తున్నాడు. ఇప్పటికీ సొసైటీకి భూమి లేకపోవడం దారుణం. జిల్లా అధికారులు వెంటనే విచారణ జరిపి సభ్యులకు న్యాయం చేయాలి," అని సంఘ సభ్యుడు కోల రాజా గౌడ్ డిమాండ్ చేశారు.

కోల రాజా గౌడ్

# 8న విచారణకు రావాలి

## బండి సంజయ్‌కు మరోమారు సిట్ నోటీసులు

**హైదరాబాద్,ఆగస్ట్5 :** తెలంగాణ పాలిటిక్స్‌లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సిట్ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆగస్ట్ 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో సాక్షిగా వాంగ్మూలం ఇవ్వాలని సిట్ కోరింది. ఈ మేరకు విచారణకు హాజరు అవుతానని సిట్‌కు బండి సంజయ్ రిప్లై ఇచ్చినట్లు–తెలిసింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని పలుమార్లు బండి సంజయ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో ఆయన పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు పెంచిన సిట్ ఇప్పటికే పలువురు రాజకీయ నాయకుల స్టేట్ మెంట్లను రికార్డ్ చేసింది. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఫహీం ఖురేషి తదితర నేతల వాం గ్మూలాలను సిట్ నమోదు చేసింది. ఇందులో భాగంగా గతంలోనే బండి సంజయ్‌కు కూడా సిట్ నోటీ–సులు జారీ చేసింది. ముందస్తు షెడ్యూల్ వల్ల బండి సంజయ్



కు సిట్ విచారణకు హాజరు కాలేదు. దీంతో ఆగస్ట్ 8వ తేదీన విచారణకు హాజరు కావాలని తాజాగా సిట్ మరోసారి నోటీస్ జారీ చేసింది.

# కాంగ్రెస్ పార్టీని కడిగి పారేస్తాం



- అసెంబ్లీలో హరీష్ ఒక్కరు చాలు
- కాళేశ్వరం కమిషన్ పూర్తిగా ట్రాప్
- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- నేతలతో కలిసి హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ వీక్షణ

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరంపై నిజాలు వెల్లడిస్తామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీని కడిగి పారేయడానికి తమ సీనియర్ నేత హరీష్ రావు ఒక్కరు సరిపోతారని కరీంనగర్. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కమిషన్ ఇచ్చిన 650 పేజీల రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ, వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతా మని హెచ్చరించారు. కాళేశ్వరం నివేదికలో నచ్చిన పేరాలను లీక్ చేశారని... నచ్చని నాయ కులను బద్నాం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్‌ను హింసించాలనే ధోరణి తప్పా.. సీఎం రేవంత్రెడ్డికి ప్రజా సమస్యలు పట్టడం లేదని గంగుల కమలాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి హరీష్ రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాల గురించి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ను గంగుల ఇతర నేతలతో కలిసి వీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ భవన్లో మాజీ మంత్రి హరీష్ రావు చేసిన ప్రజంటేషన్ తెలంగాణ ప్రజల కళ్లు తెరిపించిందన్నారు. నాటి నుండి నేటి వరకు కుట్రలు పన్నుతూనే ఉన్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరానికి అనుమతులు ఇచ్చిందే కేంద్ర ప్రభుత్వమని మాజీమంత్రి గంగుల కమలాకర్ గుర్తుచేశారు. కాళేశ్వరం పూర్తి రిపోర్ట్ బయటకు వచ్చాక కాంగ్రెస్ సంగతి చూస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే సీఎం రేవంత్రెడ్డి పాదావుడి చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై పూర్తి ఆధారాలతో హరీష్ రావు బ్రీఫింగ్ చేశారన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక పూర్తిగా ట్రాప్ అని విమర్శించారు. ముఖ్యమంత్రి బాధ్యతను మాత్రమే కేసీఆర్ నిర్వర్తించారని.. రాజకీయ జోక్యం ఎలా అవుతోందని ప్రశ్నల వర్షం కురిపించారన్నారు. దేశంలో చాలా కమిషన్లు న్యాయస్థానాల ముందు నిలబడలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. తెలంగాణ లో కమీషన్ల ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించా రు. ప్రాజెక్టులు ఎండిపోతున్నా సర్కారు. స్పందించడం లేదన్నారు. ఆంధ్రాకు చంద్రబాబు సాగునీరుకు దోచుకుపోతున్నామిన్నకుండా పోతున్నారని ధ్వజమెత్తారు.

**కాంగ్రెస్ వల్లే తెలంగాణ ఎడారి..**

గతంలో కాంగ్రెస్ పాలకులు ఏనాడూ గోదావరి నదిపై ఆనకట్ట ఒక్కటి కూడా కట్టలేదని గంగుల కమలాకర్ ఆరోపించారు. కుటిల బుద్ధితోనే ఇలా వ్యవహరించారన్నారు. దీంతో ఉత్తర తెలంగాణ ఎడారిగా మారిపోయిందని.. జీవనోపాధి కోసం బ్రతుకు దెరువులేక దుబాయికి వెళ్లాల్సి వచ్చిందన్నారు. తెలంగాణలో రైతుల సంక్షేమాన్ని కోరుతూ సాగునీరు కోసం గోదావరిపై మేడిగడ్డ కట్టిన మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం తెలంగాణ సస్యశ్యామలం అయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో తిరిగి తెలంగాణ ఎండిపోయిందని.. కేసీఆర్ పై కుట్రలతో లేనిపోనివి సృష్టించి బీఆర్ఎస్ ను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మళ్లీ కేసీఆర్ వస్తేనే రైతాంగంలో సంతోషం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# వీడిన హత్య కేసు మిస్టరీ



- వావివాహేతర సంబంధమే హత్యకు కారణం
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

కరీంనగర్ శివారులోని బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద రైల్వే ట్రాక్ పక్కన జరిగిన హత్య కేసు మిస్టరీని కరీంనగర్ రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి హత్యకు ఉపయో గించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. జులై 29న సుభాష్ నగర్ కు చెందిన బలవేణి సంపత్ (45) రైల్వే ట్రాక్ పక్కన అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గ్రంథాలయంలో స్వీపర్ గా పనిచేసిన సంపత్, తన కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు. చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగం గా మృతుడి భార్య బలవేణి రమాదేవి (38)పై అనుమానం రావడంతో ఆమెను అదుపులోకి తీసుకుని విచారించారు. రమాదేవికి కిసాన్ నగర్ కు చెందిన కర్రె రాజయ్య (50) తో వివాహేతర సంబంధం ఉంది. భర్త సంపత్ మద్యానికి బానిస కావడంతో తరచూ రమాదేవిని కొట్టేవాడు. దీంతో విసిగిపోయిన రమాదేవి, రాజయ్య, తన దూరపు బంధువైన కీసరి శ్రీనివాస్ (35) (ఖాదర్ గూడెం) లతో కలిసి సంపత్‌ను హత్య చేయాలని ప్లాన్ వేసింది. ప్లాన్ ప్రకారం, రాజయ్య, శ్రీనివా స్ కలిసి సంపత్ను బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్దకు రమ్మని చెప్పి, అక్కడ మద్యం తాగారు. సంపత్ పూర్తిగా మత్తులోకి వెళ్లిన తర్వాత, రమాదేవి ఫోన్ చేసి అతడిని చంపమని చెప్పింది. రమాదేవి ఆదేశాల మేరకు రాజయ్య, శ్రీనివాస్ తను వెంట తెచ్చుకున్న గడ్డి మందు. (హెర్బిసైడ్ ) ను సంపత్ చెవిలో పోసి హత్య చేశారు. సంవత్ చనిపోయాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత, రమాదేవి, రాజయ్య, శ్రీనివాస్ ముగ్గురూ కలిసి సంపత్ కోసం వెతుకుతున్నట్లు నటించారు. చివరికి సంపత్ మృతదేహం ఉన్న ప్రాంతాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. కర్రె రాజయ్య (50) అలియాస్ రాజు అలి యాస్ రాజన్న, కీసరి శ్రీని వాస్ (35), ఐలవేణి రమాదేవి (38) అరెస్టయ్యారు. హత్యకు ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్లు, మూడు సెల్ ఫోన్లను, మద్యం బాటిళ్లు, గడ్డి మందు (హెర్బిసైడ్) డబ్బాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరిం చిన కరీంనగర్ రూరల్ పోలీసులు, సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సై లు తాండ్ర నరేష్, లక్ష్మా రెడ్డి, వారి బృందాన్ని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు.

# బీజేపీ వైపు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల చూపు

- త్వరలోనే పార్టీలో చేరుతారని ప్రచారం

**హైదరాబాద్,ఆగస్టు5 :**

కాళేశ్వరం కమిషన్ రిపోర్టుతో ఉక్కిరిబిక్కిరవుతున్న గులాబీ పార్టీకి మరో సంక్షోభం వచ్చి పడింది. ఆ పార్టీకి చెందిన పది మంది మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు రెడీ అవుతున్నారు. వీరిలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. వీరు బీజేపీ వైపు అడుగులు వేస్తున్నట్టు సంకేతాలు కూడా ఇచ్చారు. అయితే ఆపరేషన్ ఫాంహౌస్ కేసులో చిక్కిన నలుగురు మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, రేగా కాంతారావు, పైలట్ రోహిత్ రెడ్డి కూడా పార్టీలో బీజేపీలో చేరబో తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. అదే విధంగా ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కీలక నేతలు బీజేపీ వైపు చూస్తున్నట్టు– సమాచారం. ఈ నెల 9న నలుగురు మాజీ ఎమ్మెల్యేలు ఢిల్లీలో బీజేపీ కీలక నేతల బీఎల్ సంతోష్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకొనేందుకు రెడీ అయిపోయారని సమాచారం. వీరిలో నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ఇద్దరు ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే ఉన్నట్టు తెలుస్తోంది. రెండో దఫాలో మరో ఆరుగురు బీజేపీలో చేరుతారని సమాచారం. అయితే బీజేపీతో ఇప్పటికే చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఆపరేషన్ ఫాంహౌస్ కేసులో పాల్గొన్న నేతలంతా బీఎల్ సంతోష్‌తో మంతనాలు సాగించినట్టు తెలుస్తోంది. ఉమ్మడి పాల మూరు జిల్లాకు చెందిన మరో ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మరో మాజీ ఎమ్మెల్యేతో పాటు మరో ఇద్దరు కీలక నేతలు చేరుతారని సమాచారం.

# రాహుల్ వ్యాఖ్యలు సమర్థనీయమే

- ఇండియా కూటమి పార్టీల మద్దతు

**న్యూఢిల్లీ,ఆగస్టు5 :** భారత్ జోడో యాత్ర సమయంలో దేశ సైన్యంపై అనుచిత వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని సుప్రీంకోర్టు సోమవారం మందలించింది. అయితే రాహుల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు నిరాధారణమైనవని, రాహుల్ వ్యాఖ్యలు సరైనవేనంటూ ఇండియా కూటమిలోని పలు పార్టీలు అభిప్రాయపడ్డాయి. జాతీయ అంశాలను ప్రశ్నించే బాధ్యత రాజకీయ పార్టీలకు ఉంటుందని నొక్కి చెప్పాయి. ఈ అంశంపై ఇండియా కూటమిలోని పలు పార్టీలకు చెందిన సభాపక్ష నేతలు సమావే శమై చర్చించారు. రాజకీయ పార్టీల ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా న్యాయ స్థానం అసాధారణమైన వ్యాఖ్యలు చేసింది. దీన్ని అన్ని పార్టీల నేతలూ అంగీకరించారు.

# కొండగట్టుకు భారీగా భక్తుల రాక

- అన్నదానం టోకెన్ల కోసం ఎగబడ్డ జనం

**జగిత్యాల,ఆగస్టు5 :**

అంజన్న పుణ్య క్షేత్రం కొండగట్టులో భక్తుల రద్దీ కార ణంగా అన్నదానం టోకెన్ల కోసం కొట్లాట జరిగింది. కొండగట్టు– ఆంజ నేయ స్వామి సన్నిధికి భక్తులు మంగళవారం భారీగా తరలివెళ్లారు. మంగళవారం పైగా శ్రావణ మాసం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున గుట్టకు చేరుకొని అంజన్నకు మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. సూపరిండెం ట్లు సునీల్, చంద్రశేఖర్ ఆధ్వర్యం లో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. నిత్యం అన్నదానం చేసే సత్రం దగ్గర టోకెన్ల కోసం భక్తులు ఎక్కువ మంది రావడంతో స్వల్ప తోపులాట జరిగింది. మంగళవారం కేవలం 200 మంది భక్తులకుఅన్నదానం అవకాశం కల్పిం చడంతో సుమారు 300 పైగా భక్తులు చేరుకున్నారు. దీంతో టోకెన్ల జారీ చేసే దగ్గర స్వల్ప తోపులాట జరిగింది. అన్నదానం టోకెన్ల సంఖ్యను పెంచాల ని ఈ సందర్భంగా భక్తులు డిమాండ్ చేశారు. నిత్యం భక్తులతో కిటకిటకిట లాడే కొండగట్టు అంజన్న ఆలయం ఆషాడ మాసంలో భక్తులు లేక వెలవె లపోయింది. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో అంజన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

# పట్టణ ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ తనిఖీలు



**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓ ఎంసిహెచ్ డాక్టర్ సన జవేరియా తో కలిసి పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం హాజరు పట్టికను, అధిక రక్తపోటు, మధుమేహం వంటి అసంక్రమిత వ్యాధుల పేషెంట్ల రికార్డులను, వారికి పంపిణీ చేస్తున్న మందుల వివరాలను పరిశీలించారు. ప్రభుత్వ ఉచిత మందుల సరఫరాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలంటూ సూచించారు. లేబరేటరీని పరిశీలించిన అనంతరం, రోగుల రక్త నమూనాలను టీ–హబ్‌కు పరీక్ష కోసం పంపిస్తున్న వివరాలను గమనించారు. అలాగే, ఫార్మసీలో మందుల నిల్వలపై సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులకు అనుగుణంగా మందుల నిల్వలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

**ఇంటింటి ఫీవర్ సర్వేపై దృష్టి**

తయారు చేసిన యాక్షన్ ప్లాన్ ప్రకారం



ప్రతి ఇంటికి ఫీవర్ సర్వే చేయాలని, జ్వరలతో బాధపడే వారిని గుర్తించి తక్షణ చికిత్స కల్పించాలని సూచించారు.

**డ్రై డే కార్యక్రమాలపై అవగాహన**

ప్రతి మంగళవారం, శుక్రవారం "డ్రై డే" కార్యక్రమాలు నిర్వహిస్తూ, "దోమలను పుట్టనివ్వద్దు – కుట్టనివ్వద్దు" అన్న నినాదంతో ప్రజల్లో దోమల నివారణపై అవగాహన పెంపొందించాలన్నారు. ఈ తనిఖీలో పట్టణ వైద్యాధికారి డాక్టర్ ఇమ్రాన్, సూపర్వైజర్ బేగ్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.